# అత్యాశ

ఈ పెళ్లిళ్లూ, తగాదాలూ, అత్తవారి అత్యాచారాలూ, చూసీ, వినీ వున్న శారద, చదుకుని, జాబ్‌చేసుకుంటూ సింగిల్‌గా వుండిపోదామని అత్యాశకు పోయింది. కానీ, తానొకటి తలిస్తే దైవమొకటి తలచింది. అడుగులోనే హంసపాదు లాగా చదువుకి పెట్టుబడి కావల్సివచ్చింది. పావెర్టీ సర్టిఫికేట్ పదేపదే ప్రొడ్యూస్ చేయలేక శారద ప్రాణం చావికొచ్చింది.

ఆడపిల్లలకి జీతాలు లేవనే శుభదినాలు వచ్చినా, వుండ గూడూ, తిన తిండీ, కట్ట బట్టా, టెక్స్టు బుక్సూ, నోటుబుక్సూ, పెన్నూ, పెన్సిలూ, సిరా అమర్చుకునేప్పటికి శారదకు అత్యాశకు పోయినాను అనిపించింది.

'డిగ్రీ' అందని మ్రాని పండులాగా తోచింది. ఇంటర్ కుంట సాగింది. జూనియర్ కాలేజీ స్వంత గ్రామంలో లేదు. పట్నానికి నడవలేక పోయింది.

మహానుభావుడు నరసయ్య, వారింట్లో గదిలో వుండి చదువుకోమన్నాడు. నరసయ్యగారి భార్య నరసమ్మ. ఆవిడ కడుపు ప్రతీయేడూ పండుతుంది. బలగం లేదామెకి, అందు కని తనకు పొద్దునా సాయంకాలం పనిలో సాయపడితే, తనచీర యిచ్చి, కొత్తరవిక పెడతానన్నది.

తాసీల్దారు కాళ్ళు పట్టుకుని, ఫుల్ ఫీ కన్సెషన్ తెచ్చాడు శారద తండ్రి. సెకండ్ హాండ్ టెక్స్టూ, చౌకలో నోటుబుక్సు

తెచ్చిచ్చాడు. ఇంటర్ అనే నదిని యీదుతుండగా హెవీవర్క్ వల్లా డెఫిషెన్సీవల్లా శారద జబ్బు పడింది.

'నేను నిన్ను కన్నానా? నా పిల్లలు నాకు చాలరా? నీకు వైద్యంగూడా చేయించాలా?' అని నిష్ఠూరమాడింది నరసమ్మ. చాలా పని చేయలేక, పుద్యాసనా చెప్పలేక, అత్యాశకు పోయి వంటగూడా చేయించానే, అని చింతించింది. బిడ్డల తల్లిగాదూ తనకు తెలిసిన ప్రభుత్వ డాక్టరు దయానిధి అడ్రసు యిచ్చి వైద్యం చేయించుకు రమ్మని పంపించి శారదను.

దయానిధి శారద కోలుకునేందుకు, మందులూ, టానిక్కులూ, దయగల మాటలూ వాడాడు. బిల్ చెల్లించలేదని తెలిసి ముద్దులు తీసుకున్నాడు. ఫలితంగా శారద శా ర దాం బ అయింది. తనది అత్యాశేననుకున్నది. ఫైనల్సు రాయాలి. తండ్రి తీసికెళ్ళడు. నరసమ్మ వెళ్ళగొట్ట లేదూ. ప్రిన్సిపాల్ పాసయింది అన్నాడు. నరసయ్య ఒడ్డు పట్టించాడు. శారద కొడుకునెత్తుకుని నవ్వి, 'మోడరన్ మనుమడు' అన్నాడు.

దయానిధి శారద బరువు మోయదలచలేదు. నర్సు ట్రెయినింగ్‌లో సీటు తెప్పించాడు. అతనికి రోగులను దోచటం చాతగాదు. జబ్బు లేదని తెలిస్తే "డబ్బు ఖర్చు చేసుకోకు" అని సలహా యిస్తాడు.

తన ఫామిలీ, తండ్రి ఫామిలీ మానేజ్ చేయాలి. మరో ఫామిలీ కూడానా? అని భయపడి పోయాడు.

నర్సు ట్రైనింగు అనే కాలవను శారద అలాగ్గా యీదేసింది. పని బాగా చేస్తుందని బిరుదొచ్చింది. ఆ బిరుదు జాబ్ తెచ్చిపెట్టింది. నరసమ్మకి వైద్యం కావాలి, శారదను వెళ్ళనీయలేదు.

శారద తండ్రి లోన్ సంపాదించగలిగాడు. పాలెంలో చౌకగా ప్లాటు దొరికింది.

"ఇల్లు నీపేర కట్టిస్తున్నాను. నీ జాబ్‌చూసి లోన్‌యిచ్చారు" అని కూతురుతో చెప్పి వాయిదా చెల్లించాలని డబ్బు పట్టుకెళ్లాడు.

శారద జీతం తనచేతికి వస్తుందని అత్యాశకు పోయిన నరసమ్మకి యెదురుదెబ్బ తాకినట్టయింది. నరసయ్యగారి సంపాదన యేమూలకీ చాలటంలేదు. వడ్డీ వ్యాపారం చేసినా డబ్బు చాలలేదు.

'వేరే యిల్లుచూసుకో శారదాంబా, మీనాన్న వస్తూపోతూ వుంటాడు. ఇల్లు యిరుకు' అన్నది.

కాని నరసయ్య శారదను పోనీయలేదు, మందులు సప్లయి చేస్తున్నది. మందులు ధరలు మన్నంటినై. భార్యకాసంగతి చెప్పినా, నసుగుతూ, దెప్పుతూనే వున్నది.

దయానిధి భార్యా పిల్లలూ బొంబే వెళ్ళారు. అక్కడ ఆమె అన్న జస్‌లోక్‌లో డాక్టరు, సిటీ చూశారు శలవలు అయిపోయినై.

"విమానంలో వెళ్తే అదీ చూసినట్టవుతుంది చెల్లాయ్! టికెట్టు కొనేశా, పిల్లలు సరదా పడుతున్నారు మళ్లా యెప్పుడు వస్తారో." అని సెండాఫ్ యిచ్చాడు అన్న.

దుర్విధి విమానాన్ని సముద్రంలో పడేసింది. టేకాఫ్ అవుతూనే టెక్నికల్ లోపంవల్ల, పేలి నిప్పంటుకుని అగ్నిగోళం లాగా అయి పడిపోయింది.

దయానిధికి ఫోన్ చేశాడు బావమరిది.

## 2

నెలలు దొర్లినై, దుఃఖం వెనకబట్టినా దయానిధికి యిల్లు దుర్భరమైంది. అన్నీ అమ్మేసి, యిల్లు ఖాళీచేసి హోటల్లో బసచేశాడు దయానిధి. అధునాతనంగా వున్నా, అన్ని సదుపాయాలున్నా వంటరితనం పీడించ సాగింది. ఫిమేల్ పేషంట్సునీ, స్నేహితుడి పెళ్లాన్నీ చూసి అంగలార్చాల్సి వచ్చింది.

యెవరిని చూస్తే మనసు కలగదో, ఆ సర్వెంటు వచ్చి, 'బాబూ! రాత్రికి వచ్చేదా?' అని రెచ్చగొడితే మండిపోయింది దయానిధికి.

మెరుపులాగా, శారద గుర్తు వచ్చింది, రావటమేమిటి, లేడికి లేచిందే పరుగని, నరసయ్య యింటికి వెళ్తే శారద లేదు.

నరసయ్య చాలా సింపథైజ్ చేశాడు. కాఫీ యిచ్చాడు. కాఫీ బాగున్నది, సిప్ చేస్తూ అడిగాడు.

'శారద మీ యింట్లో వుండటంలేదూ?'

నరసయ్యగారు యెదురుగా కుర్చీలో కూచుని విశదీకరించాడు.

'మీకు శారద వుత్తరం రాస్తూవుంటుందను కున్నాను. మీకూ తెలియాదన్నమాట. శారద తండ్రివచ్చి, జీతమంతా పట్టుకెళ్తున్నాడని, మా ఆవిడకి కోపమొచ్చింది. దాన్ని పంపేయాలని చూసింది. శారదవల్ల మెడికల్ హెల్పున్నదని చెపితే గ్రహించింది గాదు. అత్యాశకు పోయింది. నా అత్తవారు వచ్చారు, వాళ్ళ సాయంతో స్వస్తి చెప్పింది. నేను ఆఫీసు నించి వచ్చేవ్పటికి శారదా బిడ్డాలేరు.' తువాలుతో మొహం అద్దుకున్నాడు.

డాక్టరు మర్యాదకు అడిగాడు.

"నిత్యం మెడికల్ హెల్పు యెందుకు?" సందు చిక్కింది గదా అని నరసయ్య యింట్లో అందరినీ పట్టిపీడిస్తున్న తలా ఒక రోగం వర్ణించాడు.

అవన్నీ నయంచేయాలేమో నని భయంవేసింది.

'హాస్పటల్‌కి పంపండి నే చూస్తా' అంటూ లేచాడు.

దోవలో గుర్తువచ్చింది 'శారద యెక్కడున్నదీ అడగటం మరిచానే మందమతిని' అని విచారించాడు.

శారద జాబ్ చేస్తున్న మున్సిపల్ అస్పటల్‌కెళ్ళి ఎంక్వ యరీ చేశాడు. ట్రైనింగ్ కావాలనీ, రాయవేలూర్ పంపారు డాక్టర్, అన్నది నర్స్.

టెన్షన్ హెచ్చుతుంది, లేదా డిప్రెషన్ కుంగదీస్తుంది. లాటరీ టికెట్టు కొన్నాడు, సినిమాలు చూశాడు, కథగానీ నటీ నటులుగానీ గుర్తుండరు. వోసారి బాటిల్ అందుకున్నాడు. మళ్ళా నెలల గడిచినై.

దేవుడనుకూలించాడు, మున్సిపల్ గ్రౌండ్స్‌లో యెగ్జిబి షన్‌కి వెళ్ళి, స్కేటింగు చూస్తుండగా శారద కంటబడింది. పారి పోతుందేమో నన్నట్టు, 'శారదా!' అని పో లి కే క పెట్టాడు, శారద వెనక్కు తిరిగి చూసింది గ్రౌండ్స్‌లో మిలమిల మెరిసే దీపాల వెలుగులో శారద అప్సరస లాగా అపద్బాంధవి లాగా కనబడింది.

అడ్డంవచ్చిన వాళ్ళను నెట్టేస్తు వెళ్ళాడు. శారద బుజం చుట్టూ చేయి వేశాడు.

'ట్రెయినింగు అయిపోయిందా? వేలూర్నించి యెప్పు డొచ్చా, నాకు చెప్పకుండా వెళ్ళావేం?' అన్నాడు.

అతని కుటుంబం విమాన ప్రమాదంలో పోయినట్టు శారద కి తెలియదు.

"ఝేమిటి మీరంటున్నదీ, మీయింటికొచ్చి, నేనెవరైందీ తెలియజేయ లేదంటారా?" అని అన్నది.

అతని మనస్సు చివుక్కుమన్నది. చెయ్యి తీసేశాడు. "ఇప్పుడిల్లు లేదు." అని తలవంచుకున్నాడు.

ఆ గొంతులో నిరాశ వినిపించింది, మొహంమీద విచారం కనిపించింది శారదకి, కలవర పడింది.

'అంటే?' అన్నది.

'నువ్వు వినలేదా? నీకింకా తెలియదా?'

'లేదు.'

"పోనీలే, అబ్బాయేడీ?" పక్కనేవున్నట్టు పిల్లవాడికోసం చూశాడు.

'మెన్నాళ్ళ కడిగారూ? థాంక్స్. ఆస్పత్రిలో వున్నాడు.'

"ఎడ్మిట్ చేశావా? యెందుకని?" అదుర్దాగా చూశాడు. మళ్లా బుజంమీద చేయివేశాడు.

అంతఅదుర్దా యెలా చూపగలుగు తున్నాడనుకున్నది. తల్లిగాబోతున్నానని తెలిసి యివ్వరాని సలహా యిచ్చినమనిషి గదూ? 'న్యుమోనియా వచ్చింది' అన్నది.

'మరిక్కడున్నా వేం?' అన్నాడాశ్చర్య పోతూ.

'పద, పద' వేగిరపడ్డాడు.

"ఎగ్జిబిషన్ చూపించమని బంధువులడిగితే తెచ్చాను. మేమూ వచ్చి యెంతోసేపు కాలేదు. మీరు అలా వున్నారేం? చాలా తీసేశారు. నల్లబడ్డారు, నీరసంగా నిస్పృహతో వున్నట్టున్నారేం?" సహజంగా ప్రేమతోనే గౌరవంతోనే అడిగింది.

"నీసానుభూతికీ, పరామర్శకీ చాలా సంతోషించానుగానీ మీ వాళ్ళతో చెప్పిరా. త్వరగా పోదాం."

ఇక్కడే వుండండి వస్తా. అని వెళ్ళి చెప్పివచ్చింది.

గేటుదగ్గర అందిన టాక్సీ మాటాడి, శారద సందులోకి నెట్టి, హాస్పటల్‌కి పోనీ అని అడ్రసు చెప్పాడు.

పిల్లవాడిని డిశ్చార్జ్ చేసేలోపల యిల్లు మాట్లాడాడు. ఇద్దర్నీ యింటికి తెచ్చాడు. శారదకు చెందినవన్నీ తెచ్చాడు. వాళ్ళిద్దరి సుఖశాంతులూ ధ్యేయంగా పెట్టుకున్న తరవాతగానీ దయానిధికి మనస్థిమితం చిక్కలేదు. వొం ట త నం వదిలి పోయింది. కొడుకోసం, మూడు చక్రాలసైకిలూ, గు ఱ్ఱం బొమ్మా, తోపుడు బండీ, ఆటసామాన్లూ కొన్నాడు.

ఆరోజు సాయంకాలం అయిదున్నరకి వంరడాలో వడక్కుర్చీలో కూచుని పత్రిక చదువుతున్నాడు.

శారద తండ్రి సందేహిస్తూ మెల్లిగా వచ్చాడు. ఆయనెన్నడూ చూడలేదు డాక్టరు.

"యెవరికోస మండీ? యేం కావాలి?" అన్నాడు.

మాఅమ్మాయిని చూసి పోదామని వచ్చాను. నసుగుతూ చెప్పి నిలబడ్డా డాయన.

శారద కాఫీ తెచ్చి డాక్టరుకిస్తూ తండ్రిని చూసింది.

మానాన్న అన్నది. లోపలికెళ్లా రిద్దరూ.

అరు నెలలు గడిచేప్పటికి మామ యెందుకొస్తున్నాడో అల్లుడికి తెలిసిపోయింది. నక్కచూపులూ, నంగిమాటలూ ఆయన స్వభావాన్ని చెప్పినై, దోపిడీ చేస్తున్నాడు.

మొదటి భార్యాపిల్లలతో వేగుతున్నప్పుడు, దయానిధి ప్రతీనెలా అప్పుచేయాల్సి వచ్చేది. శారదను తెచ్చుకున్నాక రాబడి యెక్కువైన మాటా నీజమే, అప్పుచేయని సంగతీ నిజమే, కాని మరో సంవత్సరం గడిచేప్పటికి, యెక్కడెక్కడి బంధువులూ, పుట్టలోంచి వచ్చే పాములల్లే, రాసాగారు. శారద నర్సూ, తాను డాక్టరూ వైద్యసహాయం కోసమే వచ్చేవారు. ఆత్మీయులైతే ధనసహాయం గూడా చేయాల్సివచ్చేది. యెక్కువ మంది శారదవేపు వారే, పోతూ పోతూ నిష్ఠూరమాడి మరీ పోయేవారు.

"చిన్న యిల్లు కట్టుకుని దీనితో లైఫ్ లీడ్‌చేస్తూ ప్రైవేట్ ప్రాక్టీస్ చేసుకుందామని అత్యాశకు పోయినాను. దీన్ని వది లేది లేదని దీనికి తెలిసి పోయింది."

గుండె రాయి చేసుకుని, స్థలం ఒక పేషంటు చౌకగా అమ్మగా కొని యిల్లు మొదలెట్టాడు దయానిధి. కట్టెలు చుట్టాలని వస్తున్నా తట్టుకుంటున్నాడు. ఇల్లుకట్టి చూడు అని సామెత పునాదులు లేచినై. స్లాబ్ వేస్తుండగా, కూలీలూ మేస్త్రీ, కంట్రా

క్టరు తొమ్మిదివేలు కాజేశాడని చెప్పారు. వాళ్ళకి పాతవైరాలు న్నాయి. కంట్రాక్టరు నిగ్గదీసి లెక్కలు చూశాడు. కంట్రాక్టరు వాడే మాయమైనాడు. మరో చేపను పట్టాడట, కూలీలద్వారా మేస్త్రిని గురించీ విన్నాడు దయా.

వాళ్ళందరికీ సెర్మన్సు యిస్తూ, వుచిత వైద్యంచేస్తు, హాస్పటల్లో యెడ్మిట్‌చేస్తు ఒక్క తాటిమీద నడిపిస్తు, తానే స్వయంగా కట్టడం చూస్తున్నాడు ద యా ని ధి. నీరసించాడు. చిక్కి పోయినాడు, దేవుడు గుర్తువచ్చాడు. దే వు డా యీ అత్యాశను పోగొట్టు. అని మొరపెట్టాడు.

దేవుడు దయ దలచాడా అన్నట్టు మరోమేస్త్రి అందాడు. మొదటిమేస్త్రికి అవమానంగా తోచి, కూలీలతోసహా మానేశాడు. కొత్త మేస్త్రిపేరు పైడియ్య.

'నేను యిల్లు పూర్తిచేసి పెడతాను బాబూ, మీరు మీజాబ్ ప్రాక్టీస్ చేసుకోండి." అని వోదార్చాడు.

దయానిధి ప్రాణం తెరిపీన బడింది.

"ఉచితంగా హెర్నియా అ ప రే ష న్ చేస్తే చేశాగాని, కష్టాలు కాసినన్నా గట్టెక్కనై. ఆడకూలీలచేత పనిచేయించటం యెంత కష్టం! వాళ్ళకులుకూ సిగ్గూ చూస్తే నే వళ్ళుజలదరిస్తుంది. ఆడునన్ను తలంటమంటున్నాడు బాబూ నేనలాంటి దాన్నిగాను, అని పితూరీ లేవదీసిందో చక్కని చుక్క. అలాంటి

లాంటి దాన్ని కాను మేస్త్రీ! అర్ధరూపాయ్ డబ్బు లాకురాను మేస్త్రీ అని పాడుతూ కాంక్రీటుతో నింపిన బొచ్చె మోస్తూ నిచ్చెనెక్కుతున్నదదే. పైడయ్య మంచి కూలీలను తెచ్చాడు."

"యెంతవరకు పూర్తయింది యిల్లు" అనుకుంటూ వెళ్ళి నిలబడిపోయాడు దయానిధి. రెండో అంతస్తుకి గోడలు లేవ దీస్తున్నాడు పైడయ్య.

"పైడయ్యా! డాబా చాలంటే గోడలెందుకు లేవదీశావు?" అని అరిచాడు.

నేనున్నాగా బాబూ! ఇనుము మిగిలిపోయినాది. సిమెంటుందాది. పొదుపుగా పూర్తిచేసి పెడతా, మీకు తెలియక యెక్కువ కొన్నారు. మళ్ళా కూలీరేటు పెరుగుతాది, మేడ లేవ దీయలేరు, మీరు మీ ప్రాక్టీసు చూసుకొండి అద్దెకిచ్చుకుందురు గాని అంటూనే రెండో స్లాబ్‌కి తయారు చేస్తున్నాడు.

"ఇప్పుడు పెరగలేదూ, సిమెంటు, యిసుక, యిటుకా తడిసి మోపెడైంది. ప్లాను గీసినందుకే అయిదువేలు లాగాడు అర్చిటెక్టు. లక్ష అని లెక్కలు రాసిచూపితే నువు రెండులక్షలు చేస్తున్నావు ఆఁ! డబ్బేది."

మేస్త్రీ చల్లగా నవ్వాడు. అదేం మాట బాబూ, నేలేనా? అప్పు నానిప్పిస్తాను వడ్డీ వుండదు, అమ్మగారూ మీరూ సంపా యిస్తుంటిరి. తీర్చేదురుగాని, మంచి అద్దెవచ్చేట్టు చూస్తా, పోనీ మొత్తం యిల్లు అద్దెకిచ్చి అప్పు తీర్చేదురుగాని, అంటూ పని ఆపకుండా చేసుకెళ్లాడు.

విధిలేనట్టు, దయానిధి మళ్లా టౌన్ ప్లానింగువారి చుట్టూ మున్సిపాలిటీ చుట్టూ తిరుగుతూ ఫ్రెండ్ షిప్ సాగించాడు. వారి కనీసకోర్కెలు తీర్చి పర్మిట్టు తెచ్చుకున్నాడు. ఆశాపాశము తాకడున్ నిడుపు సత్యము.

## 3

బాగా అలిసిపోయి మంచి నిద్ర తీశాడు, మెళుకువ వచ్చింది. ఈమాటు కలత నిద్ర పట్టింది. బెడ్‌రూమ్ తలుపు తీసి వున్నది. మెల్లిగా మాటలు వినబడుతున్నాయి.

'నువ్వు మధ్యలో డబ్బు ఆపేస్తే యెలాగమ్మా? మొదలు పెట్టిన యిల్లు పూర్తి చేయద్దూ? నీపేరే పెట్టానంటినీ, వాడు నీకేమైనా పుస్తెకట్టాడా? కులంగూడా వేరే.'

అది మామగొంతు, సన్నాయి నొక్కులు నొక్కుతున్నట్టు 'పీ పీ' అంటున్నట్టున్నది.

'మనకులమే నాన్నా, సివిల్‌మారేజ్ చేసుకున్నాము.'

డాక్టరుకి తిక్కరేగింది, గభీమని లేచివచ్చి మామకెదురుగా నిలబడ్డాడు, కళ్లు యెర్రగా వున్నాయి.

మామకి నోట మాటరాలేదు.

ఇప్పటికి కట్టిన రెండు యిళ్లూ చాల్లేండి, యెవరిపేర వున్నాయో తెలిసిపోయింది. ఆ యిళ్ళలో అద్దెకున్న వాళ్ళవద్ద

నుంచి అప్పుతెచ్చుకోండి, ఈ యిల్లు శారదదే, మీరు కడుతున్న యిల్లు బేరం పెట్టండి, మంచి ధర పలికేట్టు చూస్తా, నా ఫ్రెండ్ కొంటాడు. యెన్నిళ్ళు కడుతుందిట శారద. మొగుడూ కొడుకూ, హోటల్ తిండి తింటున్నారు. పనివాళ్ళమీద వదిలి వెళ్తున్నది. జాలీమాలీ లేదా శారదకు. ఇళ్ళే ముఖ్యమా? శారదను చూశాడు.

శారద కళ్ళప్పగించింది. నోరు పెగల్లేదు.

ఉరిమినట్టన్నాడు.

'నీపేర వున్న యిళ్ళ అఫిషల్ పేపర్స్ యేవీ? అద్దెలు నీకే చెందాలి. నువ్వు నీయిళ్ళ అద్దెలు వసూలుచేస్తూ, ఒక యింట్లో వుండాలి. జాబ్‌కి రాజీనామా యివ్వు, నేను కావాలో యిళ్లు కావాలో తేల్చుకో.' పద్మశ్రీ కోసం ప్రజాసేవ చేయమంటున్నాడా మీనాన్న. కనీసం సిమెంటన్నా సప్లయ్ చేయలేదు. తండ్రా, మొగుడా? యెవరు కావాలి?

రంకెలకి బెదిరిపోయి ఫెయింటయింది శారద.

డాక్టరుగదూ, ఫస్టెయిడ్ చేసి బెడ్‌మీదుంచాడు.

మామ పారలైజ్ అయినట్టుండి పోయాడు.

"దోపిడీ మొదలెడితే మొదటికే మోసమొస్తుందని తెలియదా ఫాదరిన్లా? రిజిస్ట్రేషన్ కాగితాలిచ్చేయ్! నేనులేనప్పుడొచ్చి శారదను బ్లాక్‌మెయిల్ చేశావంటె కేసుపెడతాను, బ్లాక్ మెయిలర్స్ ఆర్‌నాట్ సాటిస్‌ఫైడ్. మీరు నిప్పుపెట్టెలల్లే కట్టిన యిళ్ళ

గోడలు మున్సిపాలిటీ స్థలంలోకి జరిగివున్నాయని పని ఆపించారు మీచేత, ఋజువు కాబోతున్నది. నీటిపన్ను, దీపంపన్ను యింటిపన్ను రసీదు లేవీ? అని మీదికెళ్ళి అన్నాడు. ఆయన్ను లేవదీశాడు.

మామ గెంటినట్లు వెళ్ళి పోయాడు.

## 4

పైడయ్య అన్నమాట నిలబెట్టు కున్నాడు, మేడ తయారైంది. నీళ్లూ లైట్లూ వచ్చాయి. చుట్టూ, నిమ్మా, మామిడీ, కొబ్బరీ, అరటిమొక్కలు నాటారు. ఇంటిముందు పూలమొక్కలూ, ఇంటికి ఒకవేపు కూరపాదులూ, ఆకుకూరలూ లేచినై.

దయానిధి విందుచేసి సంతోషించాడు.

మళ్లా పుపద్రవ మొచ్చింది. ఒక కుటుంబం వచ్చింది. దొడ్డివేపున్న ఖాళీస్థలంలో పాక వేయించి యిస్తే యిల్లు కని పెట్టుకునుంటాము. మొక్కలు చూస్తాము. మాయాడ కూతురు యింటిపని చేసిపెడ్తది అన్నాడు.

ఆశచావదు, రోగ లక్షణాలు మాత్రమే తెలిసిన డాక్టరు దయానిధికి, ఒక కుటుంబాన్ని దొడ్లో ప్రతిష్ఠిస్తే యేమి జరిగేదీ తెలియదు కావలా వుంటారని ఆశించాడు.

పతివ్రతలాగా శారద వుద్యోగానికి రాజీనామా యిచ్చేసింది. ఇంటిపట్టున వుండి, పనివాళ్ళమీద దాష్టీకం చేయచ్చు, పనిలోకి వెళ్ళి డాక్టర్లచేత మాటలు పడక్కర్లేదని ఆశించింది.

జీతం అవసరం లేదన్నాడు వాచ్‌మన్. మందులడిగితే మందుల యేజెన్టు నాట్ ఫర్ సేల్ అని యిచ్చిపోయిన మందులూ, ఫిజిషన్స్ శాంపుల్స్ అని బల్లమీద పెట్టి పోయిన పొట్లాలలోంచి ఒక టాబ్లెట్, లేదా ఒక కాప్సూల్ పీకి యీయలేనా? అయింట్‌మెంటు చిన్నట్యూబ్ యిస్తే నష్టమేమిటి? అని ఆలోచించాడు దయానిధి.

కనిబెట్టి వుంటామన్న వారూ ఆశకు లోనైనారు. ఇంకేముందీ? తమ రోగం రొష్టూ డాక్టరు జాబే చూస్తాడు. అమ్మగారేమో పురుడూ పుణ్యం చూస్తుంది. తమ కాయకష్ట ఫలితమంతా ముంతలో యేసి పాతిపెట్టి, పెళ్ళి సంబరానికి వాడుకోవచ్చు, వంట బెడద తప్పించుకోవచ్చు. అందరికీ టీ నీ లూ తిండీ అమురుతాయని ఆశించారు. ఇంటినిండా, చుట్టాలుండగా చూసి, ఒకటీ అరా కొట్టేయచ్చని ఆశించారు.

ఓం అంటూ గాలీవానా దంచికొట్టినై పాక తలుపు వూడి యెగిరి పోయింది. పిల్లా మేకా, కోడీ కుక్కా బిలబిల మంటూ మేడలో కొచ్చేశారు. గీ, బా, బో మంటూ అరుపులూ, నేలను ఖరాబు చేశారు. నాటుపొగాకు వాసన మేడంతా వ్యాపించింది గాలి వాన మరునాడూ తగ్గలేదు. తిండి అవురావుర్న తింటూ కొట్టుకుని, తిట్టుకుని, బూతులు యెలా వుంటాయో వినిపించారు. పైనవున్న డాక్టరు దిగివచ్చి, కళ్ళు పెద్దవిచేసి వురిమాడు.

అంతలోనే, సిగ్గూ, భయం వినయం నటించారు. తుంపరలో పాకలోకి పరుగెత్తారు. తానంటే వారికెంతో భయమూ గౌరవమూ నని అనుకున్నాడు దయా.

మంచి మేడ కట్టాడని, ఇంగువ వాసనలాగా వార్త వ్యాపించింది. దయానిధి మేనత్త భ్రమర తనకు కాన్పరన్నారని నయం జేయించుతాడని వచ్చింది. చాలా పేరే వచ్చింది దయానిధికి.

"ఏవిరా! దయా! యెన్నాళ్లాయె నిన్ను జూసి, గృహ ప్రవేశానికి రమ్మని శుభలేఖ పంపవైతివి." అంటుండగా శారద మేడదిగి వచ్చింది.

"ఇదెవరూ? భార్యాబిడ్డలేరీ? యెవత్తెనో తెచ్చి పెట్టుకున్న వన్నారిదేనా? లక్ష్మీదేవిలాంటి పెళ్లాంన్నెందు కొదిలేసినట్టు?" అని మూతిమీద చెయ్యేసుకున్నది అంతలోనే వూసరవిల్లిలాగా రంగు మార్చింది.

'అనట్టు! నామతి మండిపోనూ, నీ పెళ్లాంపిల్లలు సముద్రంలో హరోహరి అయినారు గదూ. అదీ నువ్వు తెలియజేయనే లేదు. చక్కని చుక్కనూ వుద్యోగస్థురాలినీ పెళ్ళాడావు. అదీ తెలివంటే, పిల్లా? పిల్లాడా?'

భ్రమర యాకలలు పీకేసిన కోడిలాగా వుంటుంది. గోల్డ్ కవరింగు నగలూ, ఫాల్స్ టీత్, స్టీల్ ఫ్రేమ్ కళ్ళజోడు రెండద్దా

లదీ, బర్మాముడీ, నేతచీరా రవికా. నావి పెద్దకళ్లు చూడండి అన్నట్టు ఆ కళ్ళను తమాషాగా తిప్పుతుంది. షష్ఠిపూర్తి అయింది. బాదరబందీ లేదు. తనిట్లో తను పొదుపరి భర్త పెన్షనులో కొంత అలవెన్సున్నది. అదిపెట్టి జరీ అంచు చీరా రవికా కొనుక్కుంటుంది. పరాయిళ్ళ కెళ్ళినప్పుడు, వంట అందుకుని రుచిగా చేసి, తీపీ, కారమూచేసి, సుష్టుగా తిని వచ్చేస్తుంది. అది ఆమె హాబీ.

భ్రమర, కాఫీ ఫలహారం చేస్తున్నప్పుడు, వాచ్ మన్ వచ్చి 'నువ్వు పెట్టు' అంటాడు.

'గాస్ స్టౌ. యెలా?' అంటుందామె.

"పోనీ రెండగ్గి పుల్లలియ్యి" అంటుంది వాచ్‌మన్ పెళ్లాం అది పక్కనే నిలబడి వుంటుంది.

భ్రమర అగ్గిపెట్టె విసిరేస్తుంది.

వాచ్‌మన్ అందుకుంటాడు. పదిపుల్లలు తీసి జోబీలో వేసుకుని, పెట్టె ఆమెమీదికి గిరవాటేస్తాడు.

పెద్దకూతురొస్తుంది. తమ్ముడినెత్తుకుని, బోడిగుండు నిమురుతూ, నూనె బొట్టీయి. అంటుంది.

రెండోకూతురొచ్చి 'నీరుల్లి పెద్దది కావాలి' అంటుంది.

"లేదు మేము తినము" అంటుంది భ్రమర

"పోనీ వెల్లుల్లి యియ్యి." యెగబీలుస్తుంది.

"చిన్నపిల్లలు మగపిల్లలిద్దరు దిస మొలలతో వచ్చి చేతులు జాపుతారు." 'బెల్లం బెల్లం' అని జంట కవుల్లాగా అడుగుతారు ఒకేసారి.

అత్త భ్రమర చికాకు పడుతుంది.

"శారదా! ఇలాంటి వాళ్ళెక్కడందరూ? యేమీ తిననివ్వరు. తాగనివ్వరు, పని అందించరు గానీ యేమేం కావాలో అడిగేస్తూ వుంటారు." అంటుంది.

పిన్నివరస అయే భ్రమరకు సాయంచేద్దామని వచ్చింది శారద. గారెలుచేయాలి పప్పు రుబ్బమన్నది. రోటిలోచూస్తే కోడికూర కోసం రుబ్బిన మసాలా వున్నది. అది తీస్తున్న పిల్ల పేరు నూకాయమ్మ. ఓణీ వేస్తున్నది. చట్టి ముక్కూ, చిన్న నుదురూ, బండ పెదిమలూ, లావూ, నలుపూ, రోలూ, పాత్రం కడుగుతూ ముద్దుగా గారాము చేసింది.

"ఏడేన్లయినది, కాలినిండ పుండ్లే. ముండ్లు గుచ్చుకొని సీము వస్తుండ దీడ, సెప్పులు కొనివ్వరూ, పూసే మందయిపోనాది. మర్ల యివ్వలేదు."

వాళ్ళమ్మ అరుస్తూ వచ్చింది. రవిక లేదు, రెండుగూళ్ల మీదా లేచిన కురుపులు చూపింది. మూతి చివరలు యెర్రగా వున్నాయి. రొమ్ముమీద పెసరబద్దంత కురుపు. మళ్ళా శారద అందదేమోనని అడిగేసింది.

"అస్పతాలుకు తీస్కెళ్ళి, పంతురాకండా అపరేషన్ చేయించరూ? బుడ్డోడు తెల్లార్లూ పీక్కతింటాడు సూడు. సివర్లెట్ల కొరికేసినాడో. 'అని పాలుచీకిన చోట్లు చూపించింది.

మూడోకూతురుకి బోడి కొట్టించారు తలమీద కురుపులు. చెవులకి మాసిన రింగులు, ముక్కుకి రాగిపోగులు, చాలీచాలని చిన్న చొక్కా, కింద నల్లని బొట్టా, చిరిగిన చిన్న చెడ్డీ, వేళ్ళకి రాళ్ళూడిపోయిన నకిలీ వుంగరాలు రెండు. ఈ మని నవ్వింది.

'అది నీకేటొద్దీ? యెన్నా లుంటదీ?' అనడిగింది.

చివరికొడుక్కి మెళ్లో నిష్టితాడూ, దానికి తొమ్మిదిముళ్లూ మధ్య తోలుబిళ్ళ గుడ్లల్లేవు, ముక్కు కారుతున్నది దగ్గూ, తాట్టెంక చీకుతూ వచ్చాడు. యెత్తుకోమని చేతులెత్తాడు, పని పిల్లకి మోషన్సూ యేడుస్తూ పాకుతూ వచ్చింది. కళ్ళు తేలి పోతున్నాయి.

శారదకు కంపరంబుట్టింది, పప్పుగిన్నె అక్కడే వదిలేసి మేడమీదకు పరుగెత్తి తలుపేసుకున్నది.

మధ్యాన్నం భ్రమర, అంట్లగిన్నె అవతలుంచి గదిలో కునుకు తీస్తున్నది. కిటికీరెక్కలు కొట్టుకుంటున్న చప్పుడుకి మెలకు వచ్చి, తలెత్తి కిటికీవేపు చూసింది. నూకాయమ్మ జుట్టు విరబోసుకుని, కిటికీ చువ్వలు పట్టుకుని, గెంతుతూ నవ్వుతున్నది.

'తలుపు తీయవూ? పీలు సూప్తా, బాగసేతా, సెప్పాలు తెచ్చినారా? యియ్యా.' అంటూ తలుపులాడిస్తున్నది.

తనను ముసిలి దానికింద జమకట్టిందని భ్రమర ఛరుర్నలేచి తిట్టటం మొదలెట్టింది. ఆనాడాదివారం, కావటంవల్ల డాక్టరూ శారదా మేడమీద నిద్ర తీస్తున్నారు. అరుపులు విని, కిందికి దిగివచ్చారు.

"చూడరా దయా! ఇది పేలు యేరుతుందట, నా తల్లో పేలుంటాయా? నాతల దీనికందియాలా? ఇంకానయం తలపుళ్లు కడుగుతాను. బాగసేత్త అనలేదు" అన్నది.

పిల్లలను పంపేద్దామని, దొడ్డివేపు తలుపుతీసి అటుగా వెళ్ళాడు దయా. కొళాయిగొట్టం ప్లాస్టిక్‌ది పగిలింది. ఫౌంటెన్ లాగా నీరు చిమ్ముతున్నది. చిన్నపిల్లలు దానికింద తడుస్తూ ఆడుతున్నారు, తల్లీ దండ్రీ చిన్న ఆకుకొమ్మ పట్టుకునీ, చీపుని వాళ్ళను దండిస్తున్నట్టు అభినయిస్తున్నారు.

దయానిధి ఒకకొమ్మ విరిచి గుడ్డచుట్టి, కారేనీళ్ళను ఆపే లోపల టాంకులో నీళ్ళయిపోయినై.

"యీాడే, యెదవ సన్యాసి, యిటుక రాయి, నా మీద విసురుతే, కొలాయి గొట్టానికి తగిలింది." అంటూ తల్లి నవ్వులు ఒలక బోసింది.

ఈ సందట్లో వోపిల్లాడు యింట్లోదూరి, తోపుడు బండీలో పడుకుని భ్రమరను బండీ తొయ్యమన్నాడు. తరువాత సిన్నో

డు డాక్టరు గదిలోదూరి, సిరెంజిలూ, ట్యూబులూ తీసి చూస్తూ నేలమీద వదిలేస్తున్నాడు. శారద చూసింది, వాడిని తీసికెళ్ళి దొడ్లో దింపేయాలని పోయి గాజుపెంకు మీద కాలు వేసి పడి పోయింది.

భ్రమర అందర్నీ తిట్టుతూ, గెంటేస్తూ తలుపు వేయ బోయింది.

వాచ్‌మన్ భార్యా వోవేపు పిల్లాడికి పాలిస్తూ, చేతులా తలా కళ్లూ తిప్పుతూ అరిచింది.

"నీవేం జీతమిస్తున్నావా? బీనారీ! ఒక్కల్లి పాయయియ్య మంటే లేదనేసినావు. సేసేవన్ని నీవే తినేస్తున్నావు" దాని మొగుడు వాడిగా వేడిగా భ్రమరను చూసి పెళ్ళాన్ని లాక్కెళ్ళాడు.

దయానిధి శారద కాలులోని గాజుపెంకు తీస్తూ బుర్ర గోక్కున్నాడు.

రాత్రికి అంతా నిశ్శబ్దమైంది. భోజనాలైనై నిద్రకు బడ్డారు, భ్రమర గురక పెడుతున్నాది.

"మాయావిగారు కాలి పోతున్నారో" అని పెద్దగా కేకలు వినబడటంతో, దయానిధీ శారదా కిందికి దిగివచ్చారు. పాక అంటుకున్నది. లోపల తల్లీ పిల్లలూ అరుపులూ యేడుపులూ వాచ్‌మన్ యివతల నిలబడి చేతులు నలుపుకు టూ వుమ్మి తున్నాడు. నీళ్ళులేవు, తెల్లారితేగాని రావు.

దయా బొచ్చెలతో యిసుకతెచ్చి పోసి మంట అర్పాడు, భీభత్సం ఆగింది.

'పిల్లాడు నిద్దరోతూ సీరింతా తడిపినాడు. తల్లి మరో సీరలేక కుంపటిమీద సీర యెచ్చబెడుతున్నది. సీర జారి కుంపటి మీద బడినాది. సీర అంటుకుని పాక అంటుకున్నాది.' వాచ్‌మన్ చెప్పాడు. అందర్నీ యివతలికి తెచ్చాడు. పెళ్లాం గజగజా వణికి కిందబడి బిగుసుకు పోయింది.

'సచ్చింది' అన్నాడు మొగుడు.

రైలువచ్చేవేళ, ఆటోలు తిరుగుతున్నాయి. శారద ఆటో పిలుచు కొచ్చింది, మొత్తం కుటుంబం యెక్కారు.

శారదా డాక్టరూ మరో ఆటోలో యెక్కారు.

అడ్మిట్ చేయించీ, ఫస్ట్‌యెయిడ్ చేయించీ, జనరల్‌వార్డులో బెడ్‌మీద వుంచీ, ఇంటికి వచ్చేప్పటికి తెల్లారుజామున నాలుగైంది.

మరునాడు శారదవెళ్ళేంతి, యెక్కడెంత కాలిందీ గుడ్డంతా తీసి నిలబడింది పెళ్లాం. మొగుడేమో అప్పుయివ్వమని దీనంగా అడిగాడు. భార్యా అప్పలమ్మ దణ్ణంబెట్టింది, చీరా జాకట్టుదుప్పటీ భార్యకిచ్చి, వాచ్‌మన్‌కి అప్పుయిచ్చి వచ్చేసింది శారద.

తల్లి వచ్చేదాక భ్రమర పెట్టింది తిని, మేడలో శయినించారు పిల్లలు. పాక కాలినంతమేరా తీయించి కొత్త ఆకులు వేయించాడు డాక్టరు. కొళాయి రామూ వచ్చి కొత్త గొట్టం వేశాడు.

వాచ్‌మన్ అప్పలనాయుడు పాకలో సామానుకి కాపలా పడుకున్నాడు.

ప్రాక్టీస్ సంతృప్తికరంగా వుండేప్పటికి కారు కొనాలనే ఆశ పట్టుకున్నది దయానిధికి, మెయింటెయిన్ చేయగలనా అని ఆలోచిస్తున్నాడు. సరిగా నిద్ర బట్టలేదు. గేటుచప్పుడైతే లేచి కిటికీ తెరతొలగించి చూశాడు. పేషంటేమో, ఎమర్జన్సీ కేసెమొ, డబ్బు రాల్తుందేమో.

వెన్నెట్లో ఆడమనిషి రావటం, అదిపాకలో దూరటం కనిపించి నిరాశపడ్డాడు.

చాలా మందులు తాగిందని అప్పలమ్మని పంపేశారు.

దయానిధి వీధిలోకొచ్చేప్పటికి అప్పలమ్మ సైకిల్ రిక్షా దిగింది. పీలికలు చుట్టుకుని అష్టవంకర్లు పోయి యెదురుగా నిలబడింది.

'శారదా! అల్మరలో టానిక్కున్నది యీయి. నాదుప్పటి కూడా యిచ్చేయి అప్పలమ్మకి' అని పేషంటు కారులో దూరాడు దయానిధి.

## 5

భ్రమరకి టెస్టుచేయిస్తే కాన్సరుకాదని తేలింది. కండ బట్టి, ఒళ్లుచేసి వెళ్ళిపోయిందామె. శారద పని చేసుకోవలసి వచ్చింది. డెట్‌కేక్ యిచ్చి, గుడ్డలుతికి ఆరేయమని అప్పల మ్మకి పురమాయించి, శారద కిచన్‌లో కెళ్ళింది. అప్పలమ్మ పిల్లలకాపని తగిలించి పాకలోదూరి వంట మొదలెడుతుంది. పిల్లలు డెట్‌తో జేళ్లు రుద్దుకుని తానమాడుతారు. గుడ్డలు తక్కుండా పిండి తాడుమీద పారేసి డెటుతో వెళ్ళిపోతారు.

శారదికి బియ్యం పప్పులు, బాగు చేసుకోటం రాదు. అక్కడపెట్టి బాగుచేయమని స్నానానికి వెళ్తుంది. వచ్చిచూస్తే సగానికి సగమే వుంటాయి. అక్కడే కూచుంటే పిల్లలు మీదబడి వెకిలి చేష్టలు చేసి వంపేస్తారు.

దయానిధికి పని యెక్కువైంది. 'అప్పలనాయుడూ! గది తుడిచావా? కుర్చీలు సద్దావా?' అంటాడు.

"కూలీకెళ్లైంది, ఆలీసంగా యెల్తే కూలీ యిరగ్గోస్తాడు మేస్త్రీ. రేపుచేసిపెడతా. డీసెంటరీకి మందీయనేలేదు నువ్వు." అని వెళ్ళిపోతాడు.

టైల్స్ పరిచిన నేలగనక తుడవాలి, మరీ తెల్లారుజామున నాల్గింటికే తలుపు తట్టి,

'ఇల్లు చిమ్మి తుడవాల బాబూ, చాలా సేపౌతుంది.' అని నిద్ర పాడుచేస్తారు.

'తెల్లారి క్లీన్ చేతువుగాని' అని పంపేస్తాడు.

కొత్తమనుషులూ, పేషంట్సూ వున్నప్పుడొచ్చి, వాళ్ళనే యెగాదిగా చూస్తూ, 'లెగండి. అటెల్లి కూచో.' అంటూ నిదానంగా చేస్తూ పెళ్తారు. ఇద్దరూ ముగ్గురూ వస్తారు. "యేటి జబ్బు? యాడుంటావు?" అని పరామర్శ. చిన్నపిల్లలు వీధిలోకెళ్ళి పేషంటు కారులో దూరి హారన్ కొడతారు. స్కూటర్ యెక్కి స్టార్టుచేయాలని చూసి కిందబడి పెద్దగా యేడుపందుకుంటారు. తల్లి వచ్చి రక్షించి మోసుకెళ్తుంది పిల్లల్ని. ఇల్లంతా పరుగెత్తి దోబూచులాడుకుంటారు.

అప్పలమ్మ కోళ్ళను వదిలేసి, గొఱ్ఱెను గేటుకి కట్టి నులక మంచం ప్రహరీగోడకానించి, పుల్లలమోపు దానిపక్కగా వుంచి వెళ్ళిపోతుంది.

వాచ్‌మన్ గేటవతల నిలబడిన డ్రైవరుతో,

"యెంత నిజాయితీగా సేసినా, మంచి జీతమివ్వరు. యేమడిగినా యివ్వరు. మేముగనుక సేస్తున్నాము." అంటుండగా దయా పేషంటుని సాగనంపటానికి వస్తాడు మాయసయా లన్నీ బాబే సూస్తాడు యెలా గెల్లి పోగలం? యజమాని వంక పక్కచూపులు చూస్తాడు.

శారదకి వీళ్ళవల్ల పన్లుకావని అర్థమైంది, వళ్ళువంచి పని చేసుకుని, సన్నగా నాజూగ్గా అయింది.

"నాల్గొంద లవ్వాకావాల బాబూ, మల్లా తీరుస్తా, మా నాయన దినాలకి రెండు వేలైనై. తీర్చాల."

"కూతురు పెద్దాఅయింది అమ్మా, పండగ సేయల రెండొందలు అప్పాయాయి." అంటుంది అప్పలమ్మ.

వెళ్ళిపోండి మరొకరొచ్చి పని చేస్తామంటున్నారు. అని దయా వెళ్ళగొట్టినంత పనిచేస్తాడు.

"మూలా, మూలా, పాక పీకరాదు. నాకు నెలలు." అంటుంది భార్య.

మరోచోట పాక వేయటానికి, వేయి అవుతాది, ఇప్పించుయియాలే యెల్తాం. అంటాడు భర్త.

పేపర్లు కొనేవాడొచ్చి, దినపత్రికలు, మెడికల్ జర్నల్సు పాతపుస్తకాలు తూస్తున్నాడు, శారద చూస్తున్నది. తల్లీపిల్లలూ, పాతవిగిన్నే, బొచ్చా చట్టీలోటా, మూంతా, విరిగినగరిటా తెచ్చారు.

'అవెందుకూః' అన్నది శారద.

"అవన్నీ అమ్మేయండిః తిండికి పైసలులేవు. మీరిచ్చిన యాభై, అయిపోయాయి. కూలి లేదు. వాన బడతా వుంది. మీరమ్మితే అన్నేయం సేయుడు." అన్నది అప్పలమ్మ చంకలో బిడ్డ జారుతున్నాడు. కొనేవాడు కసిరి పంపేశాడు.

మరీ ప్రాణం విసిగి దయా పోలీసుల్ని తెచ్చాడు.

వాళ్లా చుట్టుపట్ల జరిగిన చిన్న చిన్న దొంగతనాలు చెపుతూ, ఫొటోలు చూస్తూ పిల్లల్ని చూడాలన్నారు.

దాంతో కుటుంబమంతా, ఒకళ్లనొకళ్ళు, కొట్టుకుని, తిట్టుకుని, వుమ్ముకుని గప్‌చిప్ అయిపోరు. వరసగా నెలలో రోజులు హానెస్ట్ అయి వనంతాచేస్తు సభ్యతగల పౌరులలాగా వున్నారు.

'బాగు పడ్డారు' అనుకున్నాడు దయానిధి.

పిల్లల వ్యాధుల స్పెషలిస్టు వైద్యుడు, అమెరికా వెళ్తూ, తన కొత్త కారును దయానిధి నెత్తినరుద్ది వెళ్లాడు. గొడ్డుకుగొడ్డు చాకిరీ అని సామెత, అలాగా కారుకీ గొడ్డుచాకిరీ, వాచ్‌మన్ కేం బుట్టిందో దానికి చాకిరీ చేయసా డు, దయా యిచ్చింది తీసుకున్నాడు

ఆ కుటుంబాన్ని పంపిచేయలేక, నురోళ్లయితే వేయివరకు అడుగుతున్నారని, బాగానే చేస్తున్నారు లే అని సరిపెట్టుకు దయానిధి

భ్రమర అత్తకి నంజువ్యాధి పట్టుకున్నది, యే డుస్తు వచ్చింది మళ్లా. వంట అందుకున్నది. శారద టెంపొరరీ జాబ్ చేస్తున్నదని అత్తకి వైద్యం చేయబూనాడు దయానిధి.

భ్రమర కలకింగ్ టిప్స్ తెలుగులో చదివి, కొత్త వంటకం చేస్తున్నది.

"చిపీమాకు తీసికెల్లరూ మీతో, నిన్నెల్లి వస్తిరే, తెలుగు చిపీమా, మానాన్న పైసలిచ్చాడు." కిటికీలోంచిచూస్తు నూకాయమ్మ అడిగింది, అది తన చట్టిముక్కను, వచ్చి ముల్లుతో కుట్టించుకున్నది. బాగా వాపువచ్చింది. నీరుసున్నం రాచింది.

"నువ్వూ మీ అమ్మా వెళ్ళరాదుటే?" అన్నదామె.

అది వినిపించుకోక, అత్తకు కనబడాలని పైసలున్న గుప్పిలి చూపుతూ హనుమంతునిలా గెంతింది, భ్రమర కిటికీ మూసింది.

అప్పలమ్మను కేకేసి పనిచెప్పింది భ్రమర, చీర సబ్బు నీళ్ళలో వున్నది, వుతికి గంజిపెట్టాలిట, గంజిగిన్నె అక్కడుంచింది.

చుట్టతాగుతూ, పిల్లకి పాలిచ్చుకుంటూ వచ్చింది అప్పలమ్మ, దాని కొంగుబట్టుకుని, గుడ్సు ట్రెయిన్ లాగా పిల్లలు, చెప్పినపని పాడుచేసింది, భ్రమర చీర చిరిగింది, ఆవిడ తిట్టింది.

కళ్ళు తిప్పి, మెడతిప్పి, చుట్ట చేత్తో పట్టుకుని అప్పలమ్మ అన్నది.

"నాకెన్నడు పనిచేసి యెరగను, అలవాటు లేదు, మాకిలాంటివి సేతగావు"

అంత సూర్య వంశీయురాలివైతే పనిలో కొందుక్కుంది రావూ, అయోధ్య యేలకపోయినా?

'నాను కుదర్నేదు, మొగుడు సచ్చినోడు, యీదే వో సుకసౌఖ్యాలున్నా యంటే వస్తిని.'

'లేవని తెలిసిందిగా, దయచేయ రాదూ?'

'నీసేత్తైతే ఆడిని యెలగొట్టు, అడితోట్టే మావూనూ, అడి నొదిలేసి యెలాగెల్లి పోతానూ?' వెటకారం చేసి భ్రమరను యేడిపించాలని, అక్కడేకూచుని, ఒక్కసారే యిద్దరు పిల్లలకు పాలివ్వ సాగింది అప్పలమ్మ.

దాని పాతివ్రత్య ధర్మం విని, భ్రమర మూతి విరిచి, తలుపేసుకున్నది

ఆవిధంగా, పాకలోని వారూ, మేడలోని వారూ వారిని పంపలేక వారూ, వారిని వదిలివెళ్ళి నష్టపోలేక వీరూ, ఆశా, నిరాశా, పేరాశా, అత్యాశా అనే చతురస్రంలో వుండి, నాలుగు స్తంభాలాట ఆడుకుంటూ వుంటారు.

]-o-[